క్లుప్తంగా

ఉచిత నీటి సరఫరా ప్రారంభం

పొదిలి: పట్టణంలోని పలు ప్రాంతాల్లో సోమవారం నగర పంచాయతీ కమిషనర్ చంద్రశేఖరరెడ్డి, ఆర్యవైశ్య సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు గునుపూడి భాస్కర్ ఉచిత మంచి నీటి సరఫరా ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మీగడ ఓబులరెడ్డి, ముల్లా ఖుద్దూస్, షేక్.రసూల్, మాజీ ఎంపీటీసీ డాక్టర్ ఇమాంసాహేబ్, యాసిన్, కాటూరి శ్రీను, మాజీ ఉపసర్పంచ్ షేక్.జిలానీ, వెంకటేశ్వర్లు, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

18న డయల్ యువర్ డీఎం

గిద్దలూరు రూరల్: ఈ నెల 18వ తేదీ ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ బి.చంద్రశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా డిపోకు సంబంధించి మీ సందేహాలు సమస్యలు, సలహాలు సూచనలు తెలియజేయాలని ఆయన కోరారు. 99592 25702 నంబర్‌కు ఫోన్ చేయాలని ఆయన కోరారు.

19న మండల సర్వసభ్య సమావేశం

మార్కాపురం రూరల్: ఈనెల 19వ తేదీన ఉదయం 11 గంటలకు మార్కాపురంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో తోట చందన సోమవారం తెలిపారు. ఎంపీపీ బండి లక్ష్మిదేవీ అధ్యక్షతన సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు మండల రిపోర్టులతో హాజరుకావాలన్నారు.

17న రేషన్ డీలర్స్ సర్వసభ్య సమావేశం

మార్కాపురం రూరల్: జిల్లాలోని రేషన్ డీలర్స్ సర్వసభ్య సమావేశం ఈనెల 17న ఒంగోలులోని కాపు కల్యాణ మండపంలో నిర్వహిస్తారని, దాన్ని విజయవంతం చేయాలని డీలర్లు ఎస్. శ్రీనివాసులు, బి.శంకర్ సోమవారం తెలిపారు. ప్రతి గ్రామ, మండల, జిల్లాలోని రేషన్ డీలర్లు తప్పక హాజరుకావాలని కోరారు. సమావేశంలో డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకునేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు.

ప్రాజెక్టు సాకర్యకు రూ.10 వేల ఆర్థిక సాయం



ఆర్థిక సహాయాన్ని హెచ్‌ఎంకు అందచేస్తున్న కృపాకర్

తర్లుపాడు: స్థానిక ప్రభుత్వ బాలుర వసతి గృహాల అభివృద్ధికి జెడ్పీ హెచ్‌ఎం సుధాకర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రాజెక్టు సాకర్యకు ఏఈఎల్‌సీ మెంబరు ఎ జాకబ్ కృపాకర్ రూ.10 వేల ఆర్థిక సాయాన్ని అందించారు. మొత్తాన్ని ప్రాజెక్టు కన్వీనర్ సుధాకర్‌కు సోమవారం అందించారు.

పంటసాగు హక్కుపై కౌలు రైతులకు అవగాహన



కౌలురైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ శ్రీనివాసులు

మార్కాపురం రూరల్: పంటసాగుదారు హక్కుపై మండలంలోని కౌలు రైతులకు సోమవారం అవగాహన కల్పించారు. మండలంలోని నికరంపల్లి, నాగులవరం, మాల్యవంతునిపాడు గ్రామాల్లో మండల వ్యవసాయాధికారి డీ శ్రీనివాసులు అధ్యక్షతన కౌలురైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల వీఆర్‌ఓలు, వీఏఏలు పాల్గొన్నారు.

ఇరువర్గాల ఘర్షణ.. ఒకరికి తీవ్ర గాయాలు

కొమరోలు: ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకోవడంతో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని యర్రగుంట్లలో సోమవారం జరిగింది. యర్రగుంట్ల గ్రామానికి చెందిన తిరుమలయ్య అనే వ్యక్తి మీద మరో వర్గం దాడికి పాల్పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని 108లో గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



గాయపడిన తిరుమలయ్య

ఉపాధి లేదు.. భృతి లేదు

- మార్కాపురం, గిద్దలూరు నియోజకవర్గాల్లో వేలాదిగా నిరుద్యోగులు
- ఉపాధి కోసం ఎదురుచూపులు
- కూటమి ప్రభుత్వ హామీ మేరకు రూ.3 వేల భృతి ఇవ్వాలని డిమాండ్



మార్కాపురం టౌన్/బేస్తవారిపేట: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని, ఇంటికో ఉద్యోగం, ఏడాదికి రెండు లక్షల ఉద్యోగాలు...ఐదేళ్లకు 20 లక్షల ఉద్యోగాలు, ఉద్యోగం రాకపోతే నిరుద్యోగ భృతి నెలకు రూ.3 వేలు ఇస్తామన్నారు. ఇదే విషయాన్ని ఇంటింటికీ తిరిగి విస్తృతంగా ప్రచారం చేశారు. 'సూపర్ సిక్స్' పథకాల్లో ప్రధానంగా చూపించారు. గడప గడపకు తిరిగి పాంప్లెట్స్ పంచిపెట్టారు. నిరుద్యోగుల్లో విపరీతంగా ఆశలు పెంచారు. గతంలో రూ.2 వేల నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి చంద్రబాబు ప్రభుత్వం మాట తప్పింది. ఈసారైనా మాట నిలబెట్టుకోవాలని యువత కోరుతున్నారు. అధికారంలోకి వచ్చి నెలరోజులు దాటినా సూపర్ సిక్స్ హామీల్లో ప్రధానమైన ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతిపై ఎటువంటి ప్రకటన లేదు. కనీసం ఈ పథకం అమలుపై విధి విధానాలు, మార్గదర్శకాలు విడుదల చేయకపోవడంపై చదువుకున్న యువకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ అనే నిబంధనలు ఏవీ చెప్పకుండా నిరుద్యోగ భృతి ఇస్తామన్నారు.

- మార్కాపురం నియోజకవర్గంలో మార్కాపురం, రూరల్, పొదిలి, పొదిలి రూరల్, తర్లుపాడు, కొనకనమిట్ల మండలాలు ఉన్నాయి. నియోజకవర్గంలో సుమారు 75,017 కుటుంబాలు ఉండగా వీరిలో 40,210 మంది నిరుద్యోగులు ఉన్నారు.
- గిద్దలూరు నియోజకవర్గంలో సుమారు 95 వేల కుటుంబాలుండగా 60 వేల మందికిపైగా నిరుద్యోగులున్నారు.

ఎన్నికల మానిఫెస్టోలో తెలిపిన వివరాల ప్రకారం నిరుద్యోగులందరికీ యువనేస్తం అందజేయాలని డిమాండ్ చేస్తున్నారు.

చదువుకున్న ప్రతి ఒక్కరికీ నిరుద్యోగ భృతి ఇవ్వాలని యువతీ, యువకులు కోరుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని యువత కోచింగ్ సెంటర్లలో ప్రభుత్వ ఉద్యోగాల కోసం సంవత్సరాల తరబడి చదువుకుంటున్నారు. కుటుంబాలకు ఆర్థికంగా భారంగా మారినా ప్రభుత్వం ఇచ్చే భృతి అండగా నిలుస్తుందని గంపెడాశలు పెట్టుకున్నారు. జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తే ఎక్కువ శాతం యువత గుంటూరు, విజయవాడ, హైదరాబాద్ వంటి నగరాలకు స్టడీ సెంటర్‌లలో చేరేందుకు సిద్ధమవుతున్నారు.

నిరుద్యోగులందరికీ న్యాయం చేయాలి



నేను ఎమ్మెస్సీ చదువుకున్నాను. ఉపాధి లేక నిరుద్యోగిగా ఉన్నాను. టీడీపీ ఎన్నికల మానిఫెస్టోలో పేర్కొన్న ప్రకారం అందరికీ నిరుద్యోగ భృతి ఇవ్వాలి. అర్హతల పేరుతో కొర్రీలు వేయకుండా నిరుద్యోగులందరికీ రూ.3 వేలు అందించాలి.

– కే నితీష్, నిరుద్యోగి, మార్కాపురం

నిబంధనలు పెట్టడం సరికాదు



టీడీపీ ప్రభుత్వం ఎన్నికల మానిఫెస్టోలో ప్రకటించిన నిరుద్యోగి భృతిని ప్రతి ఒక్క నిరుద్యోగికి ఇవ్వాలి. రూ.3 వేల భృతి ఇస్తే ఉద్యోగాలు వచ్చే వరకు మాకు ఆసరాగా ఉంటుంది.

– ఎస్.సుధాకర్, నిరుద్యోగి, మార్కాపురం

జాబ్‌క్యాలెండర్ విడుదల చేయాలి



మేనిఫెస్టోలో ప్రకటించినట్లుగా ఇంటికో ఉద్యోగం కల్పించాలి. నిరుద్యోగులు ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా నిరుద్యోగ భృతి మంజూరు చేయాలి. నిరుద్యోగ భృతి విడుదల చేస్తే ఉద్యోగాల కోసం కోచింగ్ సెంటర్‌లకు వెళ్లడానికి పేదలకు అనుకూలంగా ఉంటుంది.

– ప్రవీణ్‌కుమార్, బేస్తవారిపేట

నిరుద్యోగ భృతి విడుదల చేయాలి



ఎలక్ట్రీషియన్ డిప్లొమా కోర్సు పూర్తి చేశాను. ఉద్యోగ నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్నాను. ప్రభుత్వం నిరుద్యోగ భృతి ఇస్తానని ప్రకటించింది. భృతి ఇస్తే ఉద్యోగం వచ్చేంత వరకు ఉపయోగకరంగా ఉంటుంది. మేనిఫెస్టోలో ప్రకటించినట్లు నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి అందించాలి.

– అక్కలి సాయికిరణ్, కందులాపురం, కంభం మండలం.

నిరుద్యోగ భృతిపై ప్రకటించాలి



ప్రభుత్వం నిరుద్యోగ భృతి, ఇంటికో ఉద్యోగంపై స్పష్టమైన ప్రకటన చేయాలి. 2016లో డిగ్రీ పూర్తి చేశారు. పదో తరగతి పాసైనప్పటి నుంచి ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయంలో నమోదు చేసుకుని రెన్యువల్ చేసుకుంటున్నాను. నిరుద్యోగ భృతి విడుదల చేస్తే ఉద్యోగాలకు కోచింగ్ వెళ్లేందుకు ఆర్థిక సమస్య తీరుతుంది.

– ఐ క్రిష్ణానాయక్, ఓబులాపురం తండా, గిద్దలూరు మండలం.

రూ.3 వేల భృతి వెంటనే అమలు చేయాలి



నేను బీటెక్ సీఎస్‌సీ చదువుకుని నిరుద్యోగిగా ఉన్నాను. ఇటీవల ఎన్నికల మానిఫెస్టోలో ఎన్‌డీఏ కూటమి నాయకులు ఇచ్చిన హామీ మేరకు రూ.3 వేల భృతిని నిరుద్యోగులకు వెంటనే అమలుచేయాలి. ఉద్యోగాలు లేక సరైన ఉపాధి కోసం యువత ఎదురుచూస్తోంది.

– పి.నాగార్జునరెడ్డి, నిరుద్యోగి, తర్లుపాడు

ఐఐఐటీలో సత్తాచాటిన విద్యార్థులు

మార్కాపురం రూరల్: మండలంలోని మిట్టమీదిపల్లి గ్రామంలోని మోడల్ స్కూల్‌లో పదో తరగతి చదివిన 8 మంది విద్యార్థులు 2023–24 సంవత్సరానికి గానూ ఐఐఐటీలో సీట్లు సాధించినట్లు ప్రిన్సిపల్ వేణుగోపాల్ తెలిపారు. సింగంశెట్టి ధీరజ్, కోడూరి శేషముని, నాగేపోగు ప్రేమ్‌కుమార్, పి.సాయి విష్ణుప్రసాద్‌లకు నూజీవిడు ట్రిపుల్ ఐటీలో, మున్నంగి శిరీష, గోమసాని మాధవిలకు ఒంగోలు ట్రిపుల్ ఐటీలో, దుక్కి కీర్తిరెడ్డికి శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీల్లో సీట్లు వచ్చినట్లు ఆయన తెలిపారు. ఉపాధ్యాయులను, విద్యార్థులను గ్రామస్థులు అభినందించారు.

చిరు జల్లులతో వాన..



గొట్లగట్టులో చిరు జల్లులతో కూడిన వర్షం

కొనకనమిట్ల: అల్పపీడనం ప్రభావంతో రెండు రోజులుగా వాతావరణం చల్లబడి చిరు జల్లులతో కూడిన వర్షం కురుస్తోంది. సోమవారం సాయంత్రం మండలంలోని నాగంపల్లి, బచ్చలకూరపాడు, గొట్లగట్టు, పాతపాడు గ్రామాల్లో ఆకాశం మేఘావృతమై చల్లటి గాలులతో కొద్దిపాటి వర్షం పడింది. గొట్లగట్టు బస్టాండ్ సమీపంలో కొద్దిపాటి వర్షానికి రోడ్డుపై వర్షం నీరు నిలవటంతో రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. ఇటీవల సాగు చేసిన సజ్జ, పత్తి, కంది పంటలకు ఈ వర్షం బాగా ఉపయోగపడుతుందని రైతులు చెబుతున్నారు.

సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలి



విద్యాశాఖాధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎంపీపీ చేగిరెడ్డి తులశమ్మ

కంభం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయపు సమావేశపు హాలులో సోమవారం మధ్యాహ్నం ఎంపీపీ చేగిరెడ్డి తులశమ్మ అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పలు సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. మండలంలోని ఎల్‌కోట పంచాయతీ పరిధిలో నీటి సమస్యను పరిష్కరించాలని, 90 శాతం పూర్తయితే నిరుపయోగంగా ఉన్న సచివాలయ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసి వినియోగంలోకి తీసుకొని రావాలని, ఏళ్లతరబడి అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ భవనాన్ని పూర్తి చేసి వినియోగంలోకి తీసుకొస్తే ప్రయోజనకరంగా ఉంటుందని ఎల్‌కోట సర్పంచ్ మహమ్మద్ బాషా కోరారు. వైద్యశాలలో వైద్యుల మధ్య సయోధ్య లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారని, హైవే రోడ్లపై ప్రమాదాలు పెరిగిపోయి ప్రాణాలు కోల్పోతున్నారని ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. సమావేశంలో ఎంపీడీఓ మస్తాన్‌వలి, తహసీల్దార్ రామయ్య, జెడ్పీటీసీ కొత్తపల్లి జ్యోతి పాల్గొన్నారు.

విద్యాశాఖపై ఎంపీపీ ఆగ్రహం

ప్రభుత్వ పాఠశాలల్లో పుస్తకాలు, బ్యాగులు, ఇతర వస్తువుల పంపిణీ సమయంలో విద్యాశాఖాధికారులు ప్రొటోకాల్ పాటించక పోవడంపై ఎంపీపీ చేగిరెడ్డి తులశమ్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం ఎంపీపీగా ఉన్న తనకు కూడా కనీస సమాచారం ఇవ్వక పోవడం ఏంటని ఆమె ఎంఈఓను ప్రశ్నించారు. ఇకపై ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలని అధికారులు రూల్స్ ప్రకారం పని చేయాలని కోరారు.

అభివృద్ధికి సహకరించాలి

బేస్తవారిపేట: అధికారులు, ప్రజాప్రతినిధులు నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశహాలులో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో పాల్గొన్నారు. శాఖల వారీగా సమీక్ష ఏర్పాటు చేసుకుని అభివృద్ధి పనులపై దృష్టిపెట్టనున్నట్లు పేర్కొన్నారు. గ్రామాల్లో నీటి సమస్య లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. మండలంలోని ఖాజీపురం, చిన్న ఓబినేనిపల్లె, గలిజేరుగుళ్లలో జలజీవన్ మిషన్ పనులు అసంపూర్తిగా నిలిచి పోవడంతో ఇబ్బందులు పడుతున్నట్లు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చారు. ఎస్సీ, బీసీ హాస్టల్స్‌లో రాత్రిపూట పిల్లలు ఉండటం లేదని, పూర్తి స్థాయిలో ఉండే వారికే వార్డెన్‌లు అడ్మిషన్‌లు ఇవ్వాలని ఎంపీటీసీ సభ్యులు కోరారు. ఉపాధి హామీ పనులు రైతులకు అనుసంధానం చేయాలని, గ్రామాల్లోని ప్రజలకు ఉపయోగపడే పనులు చేయించకుండా పాత పనులకే బిల్లులు చేసుకుంటున్నారని, ఫీల్డ్‌అసిస్టెంట్‌లు, టీఏలు కుమ్మక్కు కావడంతో పని చేయని వారికి మస్టర్ వేస్తున్నారని అక్కపల్లె, ఖాజీపురం సర్పంచ్‌లు ఆరోపించారు. గ్రామస్తులు సూచించిన పనులు ఆమోదించాలని, రానున్న రోజుల్లో ఆకస్మికంగా ఉపాధి హామీ పనులను ఆకస్మికంగా తనిఖీ చేయనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. బసినేపల్లె, ఖాజీపురం గ్రామాల్లో ఓవర్‌లోడ్‌తో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని, ఫోన్ చేస్తే లైన్‌మెన్ ఎత్తడం లేదని, రాత్రి వేళల్లో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సర్పంచ్‌లు తెలిపారు. వీధి దీపాలు గ్రామాల్లో 24 గంటలు వెలుగుతుండటంతో పంచాయతీలకు వేలకు వేలు బిల్లులు వస్తున్నాయని, త్రీఫేజ్ విద్యుత్ సరఫరా వేళల్లో ఎల్‌సీలు ఎందుకు ఇస్తున్నారని ప్రజాప్రతినిధులు విద్యుత్‌శాఖ ఏఈని ప్రశ్నించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బీవీ రాజయ్య, ఎంపీడీఓ పార్వతి, తహసీల్దార్ పద్మావతి, మండల ఉపాధ్యక్షులు డీ ఖాజామీయా, గుంటి స్వప్న పాల్గొన్నారు.

ప్రభుత్వ నిత్యావసరాల దుకాణం మూత



మూతబడిన నిత్యావసరాల దుకాణం

గిద్దలూరు రూరల్: పబ్లిసిటీ బారెడు ఆచరణ శూన్యం అన్న చందానా టీడీపీ ప్రభుత్వ వ్యవహారశైలి విధానం ఉంది. మార్కెట్ ధరల కంటే తక్కువగా సరసమైన ధరలకు నాణ్యమైన సరుకులను విక్రయిస్తామంటూ పట్టణంలోని రైల్వేస్టేషన్‌రోడ్డులోని కాంప్లెక్స్‌లో ఈ నెల 12వ తేదీన ప్రభుత్వం ఓ దుకాణాన్ని స్థానిక ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి, చైర్మన్ పాముల వెంకట సుబ్బయ్య చేతుల మీదుగా ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే అందుబాటులో లేకపోవడంతో అధికారులు చైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య చేతుల మీదుగా ప్రారంభింపజేశారు బయట మార్కెట్‌లో కిలో కంది పప్పు రూ.181 ఉండగా ఈ దుకాణంలో రూ.160, బయట మార్కెట్‌లో రెండు రకాల బియ్యం కిలో ఒక రకం, రూ.55.85, 52.40 ఉండగా వారి దుకానంలో రూ.48, 49 ల ప్రకారం సరసమైన ధరలకు నాణ్యమైన నిత్యావసరాలను పేద ప్రజలకు అందజేస్తామంటూ బోర్డు ఏర్పాటు చేశారు. కానీ ఎప్పుడూ ఆ దుకాణం మూతవేసి ఉంటారని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రోజూ దుకాణం వద్దకు వచ్చి చూడటం దుకాణం మూతపడటం చూసి అక్కడ నుంచి వెనుదిరిగి వెళ్లడం పరిపాటిగా మారిందని వాపోతున్నారు. ఈ విషయమై డీటీ అనిల్‌కుమార్‌ను వివరణ కోరగా నగర పంచాయతీశాఖ వారు దుకాణానికి మంచి గది కేటాయించలేదని, ఆ గది ప్రస్తుతం వర్షానికి కారుతుండటంతో ప్రజలకు నిత్యావసరాలు పంపిణీ చేయలేకపోతున్నామని, మంచి గదిని ఇప్పించాలంటూ నగర పంచాయతీ కమిషనర్‌ను కోరామని, నూతన గది కేటాయించిన వెంటనే సరుకులు అక్కడికి మార్చి విక్రయాలు యథావిధిగా కొనసాగిస్తామంటూ తెలిపారు.

సహారా ఇండియా కార్యకర్తలకు న్యాయం చేయాలి

- సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా



సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు సహారా కార్యకర్తలు

మార్కాపురం: సహార ఇండియా పరివార్ ఫీల్డు కార్యకర్తలకు ప్రభుత్వం న్యాయం చేయాలని కోరుతూ సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ఫీల్డు కార్యకర్తలు ధర్నా నిర్వహించి సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనాకు వినతిపత్రం అందించారు. సహారా వివాదం కారణంగా ఖాతాదారులకు పేమెంట్లు నిలిచిపోయాయని, ప్రభుత్వ ప్రోద్బలంతో సుప్రీంకోర్టు, సెబీ, సహారా రీఫండ్ అకౌంటు నుంచి రూ.5 వేల కోట్లు విడుదల చేసిందని అన్నారు. గతేడాది జూలైలో కేంద్రమంత్రి అమిత్‌షా సెంట్రల్ రిజిస్ట్రార్ కోఆపరేటివ్ సొసైటీ ద్వారా రీఫండ్ పోర్టల్‌ను ఆవిష్కరించారన్నారు. 10 నెలలు కావస్తున్నా ఇప్పటి వరకూ కనీసం రూ.500 కోట్లు కూడా ఖాతాదారులకు చెల్లించలేదని అన్నారు. ఇలా అయితే రూ.24 వేల కోట్లు చెల్లించాలంటే ఇంకెన్నేళ్లుపడతాయని సహారా ఖాతాదారులు ఆందోళన చెందుతున్నారన్నారు. పేమెంట్లు ఆలస్యంకావడంతో ఖాతాదారులు ఏజెంట్ల ఇళ్లల్లోకి వచ్చి గొడవలు చేస్తున్నారని అన్నారు. సహారా ఏజెంట్లను ఏదో తప్పుచేసిన వారిలాగా చూస్తున్నారన్నారు. ప్రభుత్వం త్వరగా ఖాతాదారులకు పేమెంటు అయ్యేలా చేసి సహారా ఏజెంట్లను కాపాడాలని కోరారు.

వేడుకగా చినసరిగేసు పీర్ల ఉత్సవం



వెలుగొండ్రాయునిపల్లిలో ఉత్సవ పీర్లు



హోమగుండం



బచ్చలకూరపాడులో ముస్తాబైన పీర్ల చావిడి

కొనకనమిట్ల: మొహర్రం పండుగ సందర్భంగా అత్యంత వేడుకగా చినసరిగేసు ఉత్సవాన్ని పురస్కరించుకుని పీర్ల ఉత్సవం జరిపారు. ప్రత్యేకంగా అలంకరించిన పీర్లతో ఉత్సవం చేస్తూ భక్తులు భక్తిని చాటారు. ముందుగా హోమగుండం వద్ద పూజలు నిర్వహించారు. మండలంలోని బచ్చలకూరపాడు, గార్లదిన్నె, వెలుగొండ్రాయునిపల్లి, గరిమినపెంట, పేరారెడ్డిపల్లి, సిద్దవరం, మునగపాడు, నాగంపల్లి, నాయుడుపేట, చినారికట్ల గ్రామాల్లో పీర్ల చావిడిలను ముస్తాబు చేశారు. మంగళవారం రాత్రికి పెద్ద సరిగేసు ఉత్సవాలను, హోమా గుండాలు జరపటానికి నిర్వాహకులు అన్నీ ఏర్పాట్లు చేశారు.

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును కొనసాగించాలి



సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న భవన నిర్మాణ కార్మికులు

మార్కాపురం టౌన్: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును కొనసాగించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనాకు వినతిపత్రం అందజేశారు. సంఘం జిల్లా కార్యదర్శి టీ ఆవులయ్య మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును కొనసాగించాలని, మెమో నెం. 12 14 ను రద్దుచేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్మికులకు సంక్షేమ పథకాలను పునరుద్ధరింపచేయాలని, క్లెయిమ్‌లు అమలు చేయాలన్నారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు డీకేఎం రఫీ మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం ఎన్నికల మానిఫెస్టోలో ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రోశయ్య, ఖాజావలి, జెర్మియా, నరసింహులు, థామస్, విన్‌బాబు, మహబూబ్‌బాషా, వెంకటేశ్వర్లు, చెన్నయ్య, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ముండ్లమూరు: మండలంలోని రాజగోపాలరెడ్డినగర్ వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు... కురిచేడుకి చెందిన బత్తుల పెద ఓబులు, అతని స్నేహితుడు అచ్చిబాబుతో కలిసి ద్విచక్ర వాహనంపై మండలంలోని రమణారెడ్డిపాలెం వెళ్తున్నారు. మార్గంమధ్యలో పెద ఉల్లగల్లు– వేముల రహదారిలో రాజగోపాలరెడ్డి నగర్ వద్ద ఎదురుగా వస్తున్న గేదెలు ఒక్కసారిగా ద్విచక్ర వాహనంపైకి రావడంతో అదుపు తప్పి ద్విచక్ర వాహనం బోల్తా పడింది. ప్రమాదంలో పెద ఓబులుకి మోకాలు పూర్తిగా విరిగింది. అచ్చిబాబుకి స్వల్ప గాయాలయ్యాయి. అదే సమయంలో ఆ మార్గంలో వెళ్తున్న వేముల డిజిటల్ అసిస్టెంట్ బ్రహ్మం గాయపడిన వారిని పైకి లేపి సపర్యలు చేశారు. 108 వాహనానికి సమాచారం అందించగా గాయపడిన వారిని దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

వైభవంగా కోటి కుంకుమార్చన పూజలు



పూజల్లో మహిళలు

పొదిలి: స్థానిక శ్రావణి ఎస్టేట్‌లోని శ్రీలక్ష్మి పద్మావతి వేంకటేశ్వరస్వామి ఆలయంలో మండలం రోజులు సామూహిక కోటి కుంకుమార్చన పూజలు నిర్వహిస్తున్నారు. ఈక్రమంలో పూజలు సోమవారం నాటికి 24వ రోజుకు చేరాయి. ఉభయదాతలను ఆలయంలోకి ఆహ్వానించి, శాలువాలతో సత్కరిస్తున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు దీవి శ్రీకాంత్ భట్టర్, ప్రధాన సలహాదారులు మురళీకృష్ణమాచార్యులు, కార్యక్రమం నిర్వాహకులు యక్కలి శేషగిరిరావు, రామాపురం కోటేశ్వరరావు, పెరుమాళ్ళ భాస్కర్, మేడా నరసింహారావు, ఎస్.నాగేశ్వరరావు, మల్లయ్య, సాయి తదితరులు పాల్గొన్నారు.

18న ప్రజావేదిక

కురిచేడు: ఈ నెల 18వ తేదీన గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సీతారామయ్య తెలిపారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి హామీ పనులపై 16వ విడత సామాజిక తనిఖీ జరుగుతుందన్నారు. దీనిపై ప్రజావేదిక ఉంటుందని పేర్కొన్నారు.

మిర్చి రైతులను ఆదుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

యర్రగొండపాలెం: మిర్చి రైతులను ఆదుకోవాలని రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు మన్నె సాంబశివరావు, బాణాల రామయ్య డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక పూల సుబ్బయ్య శాంతి భవన్‌లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో రైతులు గత ఖరీఫ్ సీజన్‌లో మిర్చి పంటను విస్తారంగా పండించారని, ఈ నిలువలకు గుంటూరు మిర్చియార్డులో గిట్టుబాటు ధర లభించకపోవడంతో అనేక మంది రైతులు వివిధ ప్రాంతాల్లో ఉన్న శీతల గోడౌన్‌ల్లో నిల్వ ఉంచారని, ప్రస్తుతం మిరపకు విపరీతంగా ధరలు పడిపోయాయని, దీంతో రైతులు తీవ్ర నష్టానికి గురికావాల్సి వస్తుందన్నారు. ముఖ్యమంత్రి చొరవ చూపి వ్యాపారులు, అధికారులతో చర్చించి మిర్చికి గిట్టుబాటు ధర లభించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ నాయకులు టీసీహెచ్ చెన్నయ్య, కేవీ కృష్ణగౌడ్, ఆవుల యోగయ్య, లక్ష్మయ్య, బాలవెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
మార్కాపురం డివిజన్
99516 02963 (మార్కాపురం)
99122 25435 (గిద్దలూరు)
Office mail : sakshiongads@gmail.com